క్లుప్తంగా

డాక్టరేట్ ప్రదానం


రూకల శశికళ

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని పీఎస్సీ కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగంలో పనిచేస్తున్న అధ్యాపకురాలు రూకల శశికళ రాయలసీమ విశ్వ విద్యాలయంలో డాక్టరేట్ పట్టా అందుకున్నారు. భౌతిక శాస్త్ర విభాగం నుంచి ప్రొఫెసర్ లక్ష్మయ్య పర్యవేక్షణలో ఏపీ సీయంట్ వాటర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ బై ఆర్మ్ కోర్టెక్స్ ఫర్ అఫ్టియల్ ప్లాంట్ గ్రోత్ అనే శీర్షికపై గ్రంథ సమర్పణ చేయడంతో డాక్టరేట్ పొందినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ శుక్రవారం తెలిపారు. డాక్టరేట్ పొందడంపై పలువురు అధ్యాపకులు, సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు.

రాత్రిళ్లు విద్యుత్ కోతలు విధించొద్దు

రుద్రవరం: రాత్రి సమయాల్లో విద్యుత్ కోతలు విధించవద్దని మండల ప్రజలు విద్యుత్ శాఖ అధికారులను కోరారు. గత కొద్ది రోజులుగా మండలంలో రాత్రిళ్లు గంటల కొద్ది విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. దీంతో శుక్రవారం తెల్లవారు జామున రుద్రవరానికి చెందిన ప్రజలు గ్రామ శివారులో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ వద్దకు వెళ్లి నిరసన తెలిపారు. రాత్రి సమయాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం వల్ల పిల్లలు, పెద్దలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని కోతలల్లేకుండా చూడాలని సిబ్బందిని కోరారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

బొమ్మలసత్రం: జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు నంద్యాల టాస్క్‌ఫోర్స్ టీమ్ లక్ష్మణ్‌దాస్, ప్రవీణ్ కుమార్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో దౌలత్ ఖాన్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..బనగానపల్లె మండలం గడ్డమేకలపల్లె గ్రామ పరిసర ప్రాంతాల్లో నాటుసారా బట్టీలు ఉన్నాయనే సమాచారం మేరకు దాడులు చేసి 4 నాటు సారా బట్టీలను ధ్వంసం చేశామన్నారు. ఈ దాడుల్లో 3,200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి 30 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. సారా కాసే వారిని గుర్తించామని త్వరలోనే అదుపులోనికి తీసుకుంటామన్నారు.

ఆకతాయిలకు జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో వివిధ కేసుల్లో అదుపులోనికి తీసుకున్న నిందితులకు సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్‌రెడ్డి జైలు శిక్ష ఖరారు చేసినట్టు పోలీసు అధికారులు శుక్రవారం తెలిపారు. వివరాల మేరకు.. షేక్ హుస్సేన్‌వలి, షేక్ మహబూబ్‌బాషా స్థానిక మునిసిపల్ కార్యాలయం వద్ద మద్యం మత్తులో ఒకరినొకరు అసభ్యంగా దూషించుకుంటూ ఘర్షణ పడడంతో వారిని టూటౌన్ పోలీసులు అదుపులోనికి తీసుకుని ఐపీసీ 160 కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి వారికి 4 రోజుల జైలు శిక్ష విధించారు. ఎన్‌జీవో కాలనీలో, టెక్కె శిల్పా సహకార్ వద్ద రోడ్డుపై వెళుతున్న మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న శీలం శివకృష్ణ, నాగరాజులను టూటౌన్ పోలీసులు ఐపీసీ 294 కింద చార్జి షీటు దాఖలు చేయగా వారికి జడ్జి 15 రోజులు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

అందుబాటులో శనగ విత్తనాలు

నంద్యాల(సెంట్రల్): ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో రైతన్నలు పలు పంటలను సకాలంలో విత్తుకోలేక పోవటంతో ప్రత్యామ్నాయ పంటగా శనగ విస్తీర్ణం భారీగా పెరిగే అవకాశముందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం (ఆర్ఏఆర్ఎస్) సహసంచాలకులు ఎన్‌సీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఇందుకు అనుగుణంగా ఆర్ఏఆర్ఎస్ పలు రకాల శనగ వంగడాలను అందుబాటులో ఉంచినట్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా దేశీ రకాలైన నంద్యాల గ్రామ్ ఎన్‌బీఈజీ-776, ఎన్‌బీఈజీ-452, ఎన్‌బీఈజీ-857 రకాలు మంచి ప్రత్యామ్నాయంగా తెలిపారు. ఇవి రమారమి 90-105 రోజుల పంట కాలం కలిగి, ఎకరాకు 8-10 క్వింటాళ్ల దిగుబడులనిస్తాయని అన్నారు. మిషను కోతలకు అనుకూలంగా ఉండి, వర్షాధారంగా సాగు చేసుకోవచ్చన్నారు. ఇంకా ఎన్‌బీఈజీ-119(2016), ఎన్‌బీఈజీ-810(2020), ఎన్‌బీఈజీ-779, ఎన్‌బీఈజీ-440, ఎన్‌బీఈజీ-833 మేలైనవిగా చిరుసంచుల పరీక్షల్లో గుర్తించబడ్డాయని, వీటిని సాగు చేసుకొని అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. విత్తనాల కోసం లోకేశ్వరరెడ్డి-9996477936, రమాదేవి-8919959598 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగం

దొర్నిపాడు: ఓ వ్యక్తి పదో తరగతి, ఇంటర్ నకిలీ ధ్రువపత్రాలతో పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం పొందినట్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. ఎస్ఐ తిరుపాల్ తెలిపిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా కొమరోలు గ్రామానికి చెందిన పిక్కిలి సురేష్ మూడేళ్ల క్రితం దొర్నిపాడు పోస్టాఫీస్ పరిధిలోని చాకరాజువేములలో బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ (బీపీఎం) గా ఉద్యోగం పొందాడు. అధికారులు ధ్రువపత్రాల విచారణ చేపట్టగా సదరువ్యక్తి సమర్పించిన పత్రాలు నకిలీగా తేలాయి. నంద్యాల పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు చీటింగ్, ఫోర్జరీ కేసునమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నంద్యాల చరిత్రలో నవశకం


మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థులతో వైద్య కళాశాల ఆచార్యులు

- ప్రారంభమైన వైద్య విద్య తరగతులు
- అట్టహాసంగా ఓరియంటేషన్ ప్రోగ్రాం
- హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

నంద్యాల టౌన్: జిల్లా వాసుల చిరకాల స్వప్నం నెరవేరింది. పేద ప్రజలకు వైద్యం, పేద విద్యార్థులకు వైద్య విద్యను మరింత దగ్గర చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరింది. 2019 ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్లో భాగంగా.. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక వైద్య కళాశాల చొప్పున నిర్మిస్తామన్న హామీని చేతల్లో చూపించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో నూతనంగా నిర్మించిన నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాలలో వైద్య విద్య తరగతులు ప్రారంభమయ్యాయి. స్థానికంగానే వైద్య కళాశాల ఏర్పాటు చేయడం వల్ల వైద్య సీట్లు పెరగడంతోపాటు విద్యార్థులకు వైద్య విద్య చేరువ అయ్యింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేల మందికి ఉపాధి కల్పించే వైద్య కళాశాల ప్రారంభం కావడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నంద్యాలలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాలలో సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వరప్రసాదరావు, ప్రిన్సిపల్ డాక్టర్ స్వర్ణలత, వైస్ ప్రిన్సిపల్ ఆనంద కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఓరియంటేషన్ ప్రోగ్రాం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. కళాశాలలో ఏర్పాటుచేసిన ప్రయోగశాలలు, తరగతి గదులు, హాస్టల్ వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాలలోని వివిధ విభాగాల అధిపతులు, సహ ఆచార్యులు మాట్లాడుతూ.. వైద్య కళాశాల నిర్మించడం వల్ల అందరికీ వైద్య విద్య లభించడంతోపాటు బోధనాసుపత్రుల రూపంలో మరింత మంది ప్రజలకు వైద్య సేవలు అందించవచ్చన్నారు. విద్యార్థులందరూ ఉత్తమమైన వైద్యులుగా ఎదగాలన్నారు. డిజిటల్ క్లాసుల ద్వారా బోధన చేయడం వల్ల ప్రతి అంశం విద్యార్థులకు సులభంగా అర్థం అవుతుందన్నారు.

మొదటి సంవత్సరంలో....

2023-24 మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ విద్యా తరగతులకు గాను అనాటమీ, బయో కెమిస్ట్రీ, ఫిజియాలజీ విభాగాల్లో విద్యార్థులకు తరగతులు ప్రారంభం అయ్యాయి. అన్ని రకాల వసతులు, ప్రయోగశాలలు, పరికరాలు సిద్ధం చేశారు. విద్యార్థినీ, విద్యార్థులకు వేర్వేరుగా హాస్టళ్లు, 6 వేల పుస్తకాలతో లైబ్రరీతో పాటు డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేశారు. విద్యార్థులపై ఒత్తిడి లేకుండా చేసి ఆహ్లాదకరమైన వాతావరణంలో బోధనా తరగతులు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించారు. 222 మంది బోధన, బోధనేతర సిబ్బందితో, 150 మంది విద్యార్థులతో మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభమయ్యాయి.

అదృష్టంగా భావిస్తున్నా



నా స్వస్థలం నంద్యాల పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీ, నాన్న రామకృష్ణారెడ్డి టీచర్‌గా పనిచేస్తున్నాడు. ఇంటర్ వరకు గుంటూరులో చదువుకున్నాను. నీట్ కోచింగ్ తీసుకుని నంద్యాలలో వైద్య సీటు ఎంపిక చేసుకున్నాను. దీంతో ఇంటికి, కుటుంబసభ్యులకు దూరంగా ఉండి చదువుకోవాల్సిన అవస్థలు తప్పాయి. దీంతో ఏకాగ్రతగా చదువుకునే అవకాశం లభించింది. పుట్టి పెరిగిన నంద్యాలలోనే వైద్య విద్య అభ్యసించి డాక్టర్‌గా మారే అవకాశం కల్పించిన సీఎం జగనన్నకు కృతజ్ఞతలు. – వినయ్‌కుమార్ రెడ్డి, నంద్యాల

రైతు కొడుకు డాక్టర్



నంద్యాల జిల్లా బండిఆత్మకూరు మండలం పార్నపల్లి గ్రామానికి చెందిన గోవిందరాజు వ్యవసాయం జీవనాధారంగా కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. స్థానిక ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో కుమారుడు హరీష్ బాబును చదివించాడు. ఇంటర్ వరకు అక్కడే విద్యాభ్యాసం చేసిన హరీష్‌బాబు నీట్ కోచింగ్ తీసుకొని పట్టుదలతో చదివి మంచి ర్యాంక్ సాధించాడు. కౌన్సెలింగ్‌లో నంద్యాల వైద్య కళాశాలను ఎంపిక చేసుకుని జాయిన్ అయ్యాడు. గురువారం జరిగిన ఓరియంటేషన్ ప్రోగ్రాంలో వారు మాట్లాడుతూ.. సీఎం జగనన్న తీసుకున్న నిర్ణయం వల్లే నంద్యాల జిల్లాకు వైద్య కళాశాల వచ్చిందన్నారు. స్థానికంగానే తన కుమారుడు ఎంబీబీఎస్ చదవడం నమ్మలేక పోతున్నామన్నారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను చేరువ చేసిన సీఎం జగనన్నకు కతజ్ఞతలు తెలిపారు. – రైతు గోవిందరాజులు, అతని కుమారుడు హరీష్ బాబు

అత్యాధునిక వసతులతో వైద్య విద్య



విద్యార్థులు వైద్య కళాశాలలో అభ్యసించే తరగతులతో పాటు ఆసుపత్రిలో రోగులకు వైద్య సేవలు అందించడం ద్వారా ప్రాక్టికల్ అనుభవం వస్తుంది. బోధన తరగతులు ఎంత ముఖ్యమో ప్రయోగశాల తరగతులు, ప్రాక్టికల్ ఎక్స్‌పీరియన్స్ కూడా అంతే ముఖ్యం. బోధనాసుపత్రి ద్వారా ప్రాక్టికల్ అనుభవం పొందవచ్చు. అందుకు తగిన ఏర్పాట్లు చేశాం.

– డాక్టర్ వరప్రసాదరావు,
సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్

ఆదర్శ వైద్యులుగా తీర్చిదిద్దుతాం



ఏర్పాటు చేసిన వైద్య కళాశాలలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల విద్యార్థులే కాకుండా ఆలిండియా కోటాలో ఇతర రాష్ట్రాల విద్యార్థులు కూడా చేరడం ఆనందదాయకం. ప్రతి విద్యార్థిని ఆదర్శవంతమైన వైద్యుడిగా తీర్చిదిద్దుతాం. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉత్తమమైన వైద్యులుగా పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలి. స్టాఫ్ క్వార్టర్స్, హాస్టల్స్ కళాశాల ప్రాంగణంలోనే ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులకు సిబ్బంది రక్షణగా ఉండటంతో పాటు ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తాం.

– డాక్టర్ స్వర్ణలత ప్రిన్సిపల్

కర్నూలుకు వెళ్లి పింఛన్ అందజేత


ప్రభుత్వాసుపత్రిలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్

నంద్యాల(అర్బన్): అనారోగ్యంతో బాధపడుతూ కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న నంద్యాల మండలం భీమవరం గ్రామానికి చెందిన దూదేకుల గోకారమ్మకు ఇటీవల కొత్త విడో పింఛన్ మంజూరయ్యింది. ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న గోకారమ్మకు పింఛన్ మంజూరు విషయం తెలిసి ఉప్పొంగిపోయింది. పింఛన్ ఎలా తీసుకోవాలో తెలియక మథనపడింది. దివ్యాంగుడైన వార్డు వలంటీర్ శివనాయక్ గోకారమ్మ పరిస్థితి తెలుసుకొని తన ట్రై మోటార్ సైకిల్‌పై కర్నూలు జనరల్ ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందించడంతో గోకారమ్మ సొమ్ము చూసుకొని మురిసిపోయింది. పింఛన్ మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వ్యయప్రయాసలకోర్చి కర్నూలుకు వచ్చి పింఛన్ అందించిన వార్డు వలంటీర్‌కు కృతజ్ఞతలు చెప్పింది.

జగజ్జనని మాతకు విశేష పూజలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో జగజ్జననీ నగర్‌లో వెలసిన జగజ్జననీ దేవాలయంలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని లోక కల్యాణం కోసం ప్రజల ఆయురారోగ్యాల కోసం వివిధ రకాల ఔషధ మొక్కలతో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారి మూల విరాట్టుకు సుప్రభాత సేవ పంచామృత అభిషేకాలు క్షీరాభిషేకం నిర్వహించి అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం 100 ఔషధ మొక్కలచే ప్రోక్షణ చేయబడిన జలాలతో అమ్మవారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అదేవిధంగా దేవాలయ గోపురానికి, ఆలయ ప్రాకారానికి ఔషధ మొక్కలను అలంకరించారు. అనంతరం మహా మంగళ హారతులు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుర్గాఫ్రెండ్స్ యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత


సాయం అందజేస్తున్న సర్పంచ్ తోలసమ్మ, ఈఓఆర్డీ సుదర్శనరావు

చాగలమర్రి: మేజర్ గ్రామ పంచాయతీ చాగలమర్రి 3వ సచివాలయం పరిధిలోని 11వ వార్డు న్యూ బిల్డింగ్స్ కాలనీకి చెందిన బాలసాని వెంకటేశ్వర్లు (44) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద మంజూరైన రూ.10 వేల నగదును శుక్రవారం గ్రామ సర్పంచ్ తోలసమ్మ, ఈఓఆర్డీ సుదర్శనరావు నామినీగా ఉన్న మృతుడి భార్య గురమ్మకు అందజేశారు. మిగతా మొత్తం త్వరలో నామినీ బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని తెలిపారు.

శిరివెళ్ల: వనికినిదిన్నెకు చెందిన దొమ్మరి ఎసురేష్ మృతి చెందడంతో శుక్రవారం ఆయన భార్య నాగలక్ష్మమ్మకు వైఎస్సార్ బీమా కింద మంజూరైన తక్షణ సాయం రూ. 10 వేలను ఉప సర్పంచ్ సుబ్బరాయుడు అందచేశారు. పంచాయతీ కార్యదర్శి విజయమ్మ, గ్రామ పెద్దలు రాంపుల్లయ్య, మయన్న ఉన్నారు.

ప్రాజెక్టులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

నంద్యాల(న్యూటౌన్): పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించి సకాలంలో పూర్తి చేయాలని సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు. ఆగస్టు 17న విశాఖ నుంచి ప్రారంభమైన బస్సుయాత్ర శుక్రవారం నంద్యాలకు చేరుకుంది. దేశాన్ని కాపాడండి.. రాష్ట్రాన్ని రక్షించండి అనే నినాదంతో చేపట్టిన యాత్రకు సీపీఐ ఆధ్వర్యంలో మోటారు సైకిళ్లతో ర్యాలీ నిర్వహించి సంఘీభావం తెలిపారు. అనంతరం నంద్యాల పట్టణంలోని మున్సిపల్ టౌన్‌హాల్‌లో రాష్ట్ర రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు ఓబులేసు, రామాంజనేయులు మాట్లాడారు. ప్రతి ఎకరాకు సాగునీరు, గ్రామానికి తాగునీటి సాధనకై ఈ యాత్ర నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. రాయలసీమ జిల్లాలో పర్యటించి రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, బాబాఫకృద్దీన్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జాన్సన్‌బాబు, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి కళాకారులు చైతన్య గేయాలను ఆలపించారు.

పింఛన్ సొమ్మును సద్వినియోగం చేసుకోండి


పింఛన్ సొమ్మును అందజేస్తున్న పీడీ శ్రీధర్‌రెడ్డి

గోస్పాడు: పింఛన్ సొమ్మును లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల జిల్లా డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని జూలేపల్లె గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం పింఛన్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో కొత్తగా మంజూరైన పింఛన్‌దారుల ఇళ్ల వద్దకు వెళ్లి సొమ్మును అందజేయాలని వలంటీర్లకు సూచించారు. ఎంపీడీఓ భాస్కర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

68 మంది కౌలు రైతులకు భరోసా సాయం

శిరివెళ్ల: మండలంలో కౌలు రైతు వైఎస్సార్ భరోసా కింద ఆర్థిక సహాయం అందిందని ఏఓ సుధాకర్ శుక్రవారం తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శుక్రవారం బటన్ నొక్కి ఒకొక్కరి ఖాతాలో రూ.7500 నగదును జమచేశారన్నారు. శిరివెళ్లలో 46, గంగవరం-39 మంది, గుంప్రమాన్‌దిన్నె-52, యర్రగుంట్ల-68 గోవిందపల్లె-47, చెన్నూరు-37, బోయలకుంట్ల-31, మహదేవపురం-26, కామినేనిపల్లె-7, కోటపాడు-7, వనికినిదిన్నె-30, జూనేపల్లె-39 మందికి సహాయం అందిందన్నారు.

ఎల్ఐసీ వారోత్సవాలు

నంద్యాల(వ్యవసాయం): ఎల్ఐసీ నంద్యాల బ్రాంచ్‌లో శుక్రవారం బీమా వారోత్సవాలను బ్రాంచ్ మేనేజర్ పులినాయక్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా గురురాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ అధినేత డాక్టర్ దస్తగిరి రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. మేనేజర్ పులినాయక్, దస్తగిరి రెడ్డి మాట్లాడుతూ ఎల్ఐసీ సంస్థ ప్రజలకు, పాలసీదారులకు అందిస్తున్న సేవలను కొనియాడారు.

రీసర్వేకు సహకరించాలి

గోస్పాడు: మూడో విడత రీసర్వేకు రైతులు సహకరించాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ విజయశేఖర్, ఎంపీడీఓ భాస్కర్ అన్నారు. మండలంలోని తేళ్లపురి, జిల్లెల్ల గ్రామాల్లో రీసర్వేపై గ్రామ సభలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. సర్వే జరిగే సమయంలో రైతులు అందుబాటులో ఉండాలని కోరారు. రైతులు ఆధార్ కార్డు, రెండు ఫొటోలు, పాసు పుస్తకం జిరాక్స్, పొలం రికార్డులు తీసుకురావాల్సి ఉంటుందన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

రుద్రవరం: మండల పరిధిలోని పందిర్లపల్లె గ్రామానికి చెందిన నరసింహ (35) నంద్యాల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. కుటుంబ సమస్యలతో ఆ వ్యక్తి గురువారం ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉండగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలించారు. చికిత్స అందించినప్పటికీ కోలుకోలేక మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ శరత్ కుమార్‌రెడ్డి తెలిపారు.

భూహక్కు పత్రాల పంపిణీ


టీ.లింగదిన్నెలో భూహక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

రుద్రవరం: మండల పరిధిలోని టీ.లింగందిన్నె, శ్రీరంగాపురం గ్రామాల్లో రెవెన్యూ అధికారులు శుక్రవారం రైతులకు జగనన్న భూహక్కు పత్రాలను పంపిణీ చేశారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం కింద ఆ రెండు గ్రామాల్లో ఇదివరకే రెవెన్యూ సిబ్బంది రీసర్వే పూర్తి చేశారు. వాటికి సంబంధించి పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు కావడంతో తహసీల్దారు రవీంద్రప్రసాదు ఆయా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ గంధం రాఘవరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీల చేతుల మీదుగా భూహక్కు పత్రాలను పంపిణీ చేయించారు. టీ.లింగందిన్నెలో 700 మందికి, శ్రీరంగాపురం సచివాలయం పరిధిలో 748 మంది రైతులకు భూహక్కు పత్రాలు పంపిణీ చేస్తునట్లు తహసీల్దారు తెలిపారు. డీటీ మహబుబ్ బాష, వీఆర్వోలు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

గడప గడపలో సంతోషాల వెల్లువ


లబ్ధిదారుడికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(సిటీ): వైఎస్సార్‌సీపీ పాలనలో గడప గడపలో సంతోషాలు వెల్లివిరుస్తున్నాయని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక 30వ వార్డు ఎంఎస్ నగర్, రాయల్ కాంపౌండ్‌లో వార్డు కౌన్సిలర్ పోలూరు లక్ష్మీదేవి, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ రామచంద్రుడు ఆధ్వర్యంలో 144వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డులోని ప్రతి ఇంటినీ సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రభుత్వ పథకాలు ఇంటి వద్దకే అందిస్తున్నామన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధిని చేసి చూపిస్తున్నామన్నారు. ఏపీ ఎస్పీడీసీఎల్ శశికళా రెడ్డి, వార్డు నాయకులు కృష్ణారెడ్డి, రామకష్ణ, తులసి, దివాకర్, రవి, శంకర్, లోకేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

రుద్రవరం: మండల పరిధిలోని పెద్దకంబలూరులో గురువారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో గురువయ్య అనే వ్యక్తికి చెందిన పూరి గుడిసె దగ్ధం అయ్యింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రవీంద్రప్రసాద్ ఆ గ్రామ వీఆర్వోతో వివరాలు సేకరించి బాధిత కుటుంబానికి శుక్రవారం బియ్యం, కందిపప్పు, నూనె, రాగులు, చెక్కెర తదితర నిత్యావసర సరుకులను అందజేశారు. డీటీ మహబుబ్ బాషా, వీఆర్వో వెంకటరమణ ఉన్నారు.

ఉద్యాన తోటల సాగుకు ప్రోత్సాహం


సమీక్షలో డ్వామా పీడీ రామచంద్రారెడ్డి

నంద్యాల(సెంట్రల్): జిల్లా వ్యాప్తంగా ఉద్యాన తోటల సాగుపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు రామచంద్రారెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక డ్వామా కార్యాలయంలో హార్టికల్చర్, సామాజిక వనాలు, రూఫ్‌టాప్ హార్వెస్టింగ్ నిర్మాణాలు, ఉపాధి వ్యయం అంశాలపై ఏపీఓలు, సీసీలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాకు మంజూరైన రూఫ్‌టాప్ హార్వెస్టింగ్ నిర్మాణాల పనులు మొదలు పెట్టాలని, ఉద్యాన తోటలకు అందిస్తున్న రాయితీలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పలు అంశాల్లో ఇప్పటివరకూ సాధించిన పురోగతిపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయా మండలాల ఏపీవోలు, సీసీలు పాల్గొన్నారు.



ఈ చిత్రంలో ఓబుళంపల్లి గ్రామంలో హుసేనమ్మకు వితంతు పింఛన్ మంజూరు కావడంతో వలంటీర్ కాశిం బయోమెట్రిక్ తీసుకుంటున్నాడు. ఇటీవలే భర్త మృతి చెందడంతో పింఛన్‌కు దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం వెంటనే రూ.2,750 పింఛన్‌ను మంజూరు చేసింది. ఒంటరిగా జీవనం సాగిస్తున్న తనకు ఈ పింఛన్ సొమ్ము ఆసరాగా ఉంటుందని లబ్ధిదారురాలు హర్షం వ్యక్తం చేసింది.



ఇక్కడ చిత్రంలో మంచంలోనే పింఛన్ పొందుతున్న దివ్యాంగుడి పేరు గనిఫరూక్. ఈయన శిరివెళ్లలో నివాసం ఉంటున్నాడు. ప్రస్తుతం ఆయనకు ప్రభుత్వం రూ.3వేల దివ్యాంగుల పింఛన్ రావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నాడు. నా జీవనోపాధికి ప్రభుత్వం నెలకు రూ.3వేల ఇస్తుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నాడు. జగనన్న కృతజ్ఞతలు అంటూ సంతోషిస్తున్నాడు.



సంబరంగా వలంటీర్ రాజు నుంచి పింఛన్ పొందుతున్న దివ్యాంగుడి పేరు జమాల్ బాషా. డబ్ల్యూ గోవిందిన్నెలో నివాసం ఉంటున్నాడు. ఈయనకు ప్రభుత్వం రూ.3 వేల దివ్యాంగుల పింఛన్‌ను మంజూరు చేసింది. పనిచేసుకొని బతికేందుకు రెండు కాళ్లు పని చేయక పోవడంతో ఇబ్బందులు పడుతున్న అతనికి ప్రభుత్వం పింఛన్ మంజూరు చేయడంతో ఎంతో సంబరపడుతున్నాడు.

పింఛన్ల పండుగ

- నియోజకవర్గం వ్యాప్తంగా 1,453 నూతన పింఛన్ల మంజూరు
- రూ.10.57 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- వేకువజాము నుంచే పంపిణీ ప్రారంభించిన వలంటీర్లు
- నంద్యాల నియోజకవర్గానికి 803 కొత్త పింఛన్ల మంజూరు
- లబ్ధిదారుల ఆనందహేల


క్రిష్ణిపాడు సచివాలయం వద్ద పింఛన్లను అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆళ్లగడ్డ: ప్రభుత్వం ఈనెల కొత్త దరఖాస్తుదారులకు పింఛన్లు మంజూరు చేయడంతో లబ్ధిదారుల్లో ఆనందం నెలకొంది. వృద్ధ, దివ్యాంగ, వితంతు, ఒంటరి ఇలా పలు రకాల పంఛన్లను ప్రభుత్వం విడుదల చేయడంతో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. డయాలసిస్ రోగులకు రూ.10వేలు, దివ్యాంగులకు రూ.3వేలు, ఇతరులకు రూ.2,750 పింఛన్ సొమ్మును ప్రభుత్వం అందజేస్తుంది. 1,453 నూతన పింఛన్లు మంజూరు కాగా గతంలో 36,360 పింఛన్లు ఉండేవి. దీంతో ప్రస్తుతం నియోజకవర్గం వ్యాప్తంగా పింఛన్ల సంఖ్య 37,813కు చేరుకుంది. వీరి కోసం పింఛన్ సొమ్ము రూ.10.57 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది.

మురిపించిన కానుక

నంద్యాల(అర్బన్)/న్యూటౌన్/ గోస్పాడు: నంద్యాల నియోజకవర్గంలో కొత్తగా 803 ఫించన్లు మంజూరయ్యాయి. నంద్యాల పట్టణంలో 380, నంద్యాల రూరల్‌లో 186, గోస్పాడు మండలంలో 237 పింఛన్లు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం వలంటీర్లు ఇంటి వద్దకు వచ్చి పింఛను సొమ్ము అందించడంతో కొత్త పింఛన్ దారుల ముఖాల్లో ఆనందం వెల్లువిరిసింది. ఎవరిని అడిగి అప్పు తెచ్చుకోవాలో.. ఎలా బతకాలోనని ఆలోచనలో పడ్డ ఏ ఆధారం లేని వృద్ధులు పింఛన్ సొమ్ము రావడంతో ఊరట చెందారు. తమకు పింఛన్ అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామంటున్నారు.

ఆళ్లగడ్డ నియోజకవర్గ వ్యాప్తంగా పింఛన్ల వివరాలు

మండలం	పాత పింఛన్లు	కొత్త పింఛన్లు	మొత్తం పింఛన్లు	విడుదలైన నగదు (రూ.కోట్లలో)
ఆళ్లగడ్డ	5,631	132	5,763	1.61
ఆళ్లగడ్డ అర్బన్	5,028	94	5,122	1.43
చాగలమర్రి	6,125	416	6,541	1.83
దొర్నిపాడు	3,592	87	3,679	1.03
రుద్రవరం	6,115	359	6,474	1.81
శిరివెళ్ల	6,500	153	6,653	1.86
ఉయ్యాలవాడ	3,369	212	3,581	1.00
మొత్తం	36,360	1,453	37,813	10.57

మా దేవుడు జగన్



నా పేరు ఎల్లా స్వాగ్రం సుబ్బమ్మ. 20ఏళ్ల క్రితం కోస్తా ప్రాంతం నుంచి భర్త కొండయ్యతో కలిసి నంద్యాల మండలం పులిమద్ది గ్రామానికి వచ్చాం. పొలం పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. అద్దె ఇంట్లో ఉంటూ కాలం వెళ్లదీస్తుండగా ఏడాది క్రితం భర్త కొండయ్య మృతి చెందాడు. 58 ఏళ్ల వయస్సులో సంతానం లేని తమను ఎవరు ఆదుకుంటారని ఆందోళన చెందుతున్న సమయంలో ముఖ్యమంత్రి జగన్ వితంతు పింఛన్ మంజూరు చేసి దేవుడిలా ఆదుకున్నారు. పింఛన్ సొమ్ముతో ఆర్థిక ఇబ్బందులు కొంతమేర తీరతాయి. – ఎల్లా స్వాగ్రం సుబ్బమ్మ


పింఛన్లను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ

పింఛన్‌తో ధైర్యం వచ్చింది



నా పేరు వెంకటసుబ్బమ్మ, మాది నంద్యాల మండలం మిట్నాల గ్రామం. భర్త రత్నం ఐదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. వృద్ధాప్యంలో ఉన్న నాకు ఏ ఆధారం లేక ఇబ్బందులు పడుతున్నాను. బంధువుల సహకారంతో చిన్నపాటి పూరిగుడిసె వేసుకొని జీవనం సాగిస్తున్నాను. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాలాంటి వృద్ధులకు పింఛన్ సొమ్ము మంజూరు చేసి ఆదుకున్నారు. పింఛన్ సొమ్ము నా జీవనానికి ఉపయోగకరంగా మారింది.

–వెంకటసుబ్బమ్మ